సాక్షి జగిత్యాల

మంగళవారం । 20 । జూన్ । 2023



పోచమ్మకు బోనం మొక్కులు

జగిత్యాలటౌన్: జిల్లా జడ్జి నీలిమ సోమవారం పోచమ్మతల్లికి బోనంతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



ఆర్టీసీ బస్సు నడిపించండి

రాయికల్ : మైతాపూర్ నుంచి కోరుట్ల డిపో బస్సులు నడిపించాలని సర్పంచ్ అజారొద్దీన్ ఆధ్వర్యంలో డీఎంకు విన్నవించారు.

గరిష్టం/కనిష్టం
39.0/30.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. పగలు ఎండగా ఉంటుంది.

మిల్లర్ల మిలాఖత్!

జగిత్యాలరూరల్: జిల్లాలోని కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించిన ప్రభుత్వం.. దానిని రైస్‌మిల్లర్లకు అప్పగించింది. నిర్దేశిత గడువు ప్రకారం రైస్‌మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎమ్మార్)ను తిరిగి అప్పగించాలి. కానీ, గడువు ముగిసినా కొందరు రైస్‌మిల్లర్లు.. బియ్యం అప్పగించలేదు. అంతేకాదు.. వారికి అప్పగించిన ధాన్యం నిల్వలు కూడా మిల్లుల్లో కానరావడంలేదు. దీంతో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు.. ఇటీవల సదరు మిల్లర్లకు నోటీసులు జారీచేశారు. ధాన్యం విలువతోపాటు, అదనంగా 25శాతం జరిమానా చెల్లించాలని అందులో సూచించారు. అయినా, మిల్లర్లు ఎవరు కూడా ఈ ఆదేశాలు ఖాతరు చేయడంలేదు.



జగిత్యాల పట్టణ శివారులోని ఓ రైస్‌మిల్లులో ధాన్యం నిల్వలు(ఫైల్)

- గడువు ముగిసినా సీఎమ్మార్ అప్పగించని యజమానులు
- రైస్ మిల్లుల్లోనూ కానరాని ధాన్యం నిల్వలు
- ఆగ్రహించిన జిల్లా పౌర సరఫరాల అధికారులు
- 25శాతం జరిమానా విధిస్తూ 34 మందికి నోటీసులు
- కేసులు నమోదు చేస్తే అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు

వానాకాలం ధాన్యం ఖాళీ..

- 2022–23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 63 మంది రా రైస్‌మిల్లర్లకు ప్రభుత్వం ధాన్యం కేటాయించింది.
- ఇందులో కొందరు రైస్‌మిల్లర్లు గడువు ప్రకారం సీఎమ్మార్ అప్పగించారు.
- మరో 34 మంది సుమారు రూ.15 కోట్ల విలువైన బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది.
- గడువులోగా సీఎమ్మార్ అప్పగించాలని అధికారులు పలుమార్లు సూచించినా ఫలితం లేకుండాపోయింది.
- దీంతో సీఎమ్మార్ ఇవ్వని రైస్‌మిల్లుల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు.
- ప్రభుత్వం అప్పగించిన ధాన్యం నిల్వలు కూడా రైస్‌మిల్లుల్లో లేవని ఈ సందర్భంగా తనిఖీ అధికారులు గుర్తించారు.



ప్రభుత్వం జారీచేసిన జీవో

- దీంతో ధాన్యం విలువతోపాటు అదనంగా 25శాతం జరిమానా పదిరోజుల్లోగా చెల్లించాలంటూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఆధారంగా అధికారులు ఇటీవల మిల్లర్లకు నోటీసులు జారీచేశారు.
- గడువు ముగిసి దాదాపు పదిరోజులు గడిచినా మిల్లర్లు జరిమానా చెల్లించడంలేదు.

కేసు నమోదు చేస్తే రాజకీయ ఒత్తిళ్లు..

గడువు ముగిసినా సీఎమ్మార్ అప్పగించని, జరిమానా చెల్లించని కొందరు రైస్‌మిల్లర్లపై అధికారులు ఇటీవల పోలీసు కేసు నమోదు చేశారు. అయితే, అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు తీవ్రతరం చేయించిన మిల్లు యాజమాన్యాలు.. కేసులనూ పక్కదారి పట్టించాయి. దీంతో అధికారులు మిగతా వారిపైనా కేసులు నమోదు చేయించేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు భారీగా గండిపడుతోంది.

ఈసారి సీఎమ్మార్ కేటాయింపు లేనట్లే..

- ప్రస్తుతం ప్రభుత్వానికి సీఎమ్మార్, జరిమానా బకాయి ఉన్న జిల్లాలోని 34 మంది రా రైస్ మిల్లర్లకు ఈ వానాకాలం సీఎమ్మార్ అప్పగించే విషయంలో అధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు.
- నిబంధనల ప్రకారం బకాయిపడ్డ బియ్యం, అదనంగా 25శాతం జరిమానా చెల్లిస్తేనే మళ్లీ ధాన్యం కేటాయించాల్సి ఉంది.
- బాధ్యులైన రైస్‌మిల్లర్లు అటు బియ్యం అప్పగించకుండా, ఇటు జరిమానా చెల్లించకుండా.. చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకుని, రాజకీయ ఒత్తిళ్లతో మళ్లీ సీఎమ్మార్ తీసుకునేందుకు యత్నాలు సాగిస్తున్నారని తెలిసింది.

నోటీసులు జారీచేశాం



గత వానాకాలంలో తీసుకున్న ధాన్యాన్ని మరపట్టి ప్రభుత్వానికి బియ్యం చెల్లించని 34మంది రైస్‌మిల్లర్లకు నోటీసులు జారీచేశాం. ధాన్యం విలువతోపాటు అదనంగా 25శాతం జరిమానా చెల్లించాలని సూచించాం. మిగతా వారిలో కొందరు చెక్కులు ఇవ్వడంలో, మరికొందరు ప్రభుత్వ ఖాతాకు ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించడంలో నిమగ్నమయ్యారు.

– చందన్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి

ముంపు ముప్పు తప్పేనా?



'ఏటా వానాకాలం వచ్చిందంటే మస్తు ఇబ్బంది అవుతంది.. ఇంటి చుట్టూ నీరు చేరుతంది.. బయటకు రాలేని పరిస్థితి.. పోయినేడాది ఇంటిచుట్టూ నీళ్లు చేరినయి.. ఎలాగోలా బయటపడి చుట్టాల ఇంట్ల తలదాచుకున్నం.. వరదముంపు బాధ నుంచి తప్పించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నమని చెబుతున్నరు.. ఈసారి వర్షం, వరద ముంపు బాధ తప్పుతుందో.. లేదో చూడాలి'

– కోరుట్ల ప్రకాశం రోడ్డుకు చెందిన పెంట అశోక్ ఆవేదన ఇది.



జేసీబీ సాయంతో కాలువ మరమ్మతు చేస్తున్న సిబ్బంది

- కంచరకుంటలో పూడికతీత
- నీటికాలువకు మరమ్మతు
- కొనసాగుతున్న పనులు

కోరుట్ల: లోతట్టు ప్రాంతాల్లోని చాలామంది జనం మదిలో మెదులుతున్న సందేహం 'వర్షం.. వరద ముప్పు'. ఏటా వర్షాకాలం వచ్చిందంటే చాలు పట్టణలోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. నివాసాల చుట్టూ వరదనీరు చేరడంతో జనం ఇళ్ల నుంచి బయటకు అడుగు పెట్టలేని పరిస్థితి ఏర్పడుతోంది. గతేడాది పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ప్రకాశంరోడ్డు, ఝాన్సీరోడ్డు, అయిలాపూర్‌రోడ్డు, కల్లూర్ రోడ్డు తదితర లోతట్టు ప్రాంతాల్లోని వందల ఇళ్లు జలదిగ్బంధంలో చిక్కుకుని జనం విలవిల్లాడారు. కొందరు వరద ఉధృతి తట్టుకోలేక ఇళ్లు కూలిపోతాయోనని భయపడి రాత్రింబవళ్లు ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నారు. మరికొందరు ఇళ్లు ఖాళీచేసి బంధువులు, తెలిసిన వారి ఇళ్లకు వెళ్లిపోయి తలదాచుకున్నారు.

ముంపు ముప్పు తప్పించేలా..

- భారీవర్షాలు, వరదలతో గతేడాది ఎదురైన ప్రమాదకర పరిస్థితుల నుంచి లోతట్టు ప్రాంతాలను సురక్షితంగా ఉంచేందుకు ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య సూచనలతో అధికార యంత్రాంగం ఈసారి ముందుగానే అప్రమత్తమైంది.
- అప్పుడు వరదనీరు కంచరకుంట నుంచి రావడంతో కుంటలో పూడికతీత తీసి నీటి నిల్వ సామర్థ్యం పెంచే చర్యలు చేపట్టింది.
- ఇప్పటికే పూడుకుపోయిన కంచరకుంట నుంచి అయిలాపూర్ చెరువుకు వెళ్లే డిస్ట్రిబ్యూటరీ కాలువను అధకారులు మరమ్మతు చేస్తున్నారు.
- తద్వారా కంచరకుంట నుంచి నీరు పట్టణంలోకి రాకుండా నేరుగా అయిలాపూర్ చెరువులోకి చేరేలా మళ్లింపు చర్యలు చేపట్టారు.
- ఇప్పటికే ఈ పనులు పూర్తికావస్తున్నాయి.
- ఇదే రీతిలో మద్దులచెరువులో పూడిక తీయడానికి సన్నాహాలు చేస్తున్నారు.
- ఈ పనులు ఆశించిన ఫలితాలు ఇస్తే ఈసారి పట్టణ ప్రజలకు ముంపు బాధ చాలామటుకు తప్పుతుందని పట్టణవాసుల నుంచి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సమస్యలు తలెత్తకుండా చర్యలు



ఈసారి పట్టణ ప్రజలకు వరద ముంపు సమస్య లేకుండా పూర్తిచర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే చాలావరకు పనులు పూర్తయ్యాయి. కంచరకుంట, మద్దులచెరువు పూడికతీత పనులు చేపట్టాం.

– ఆయాజ్, మున్సిపల్ కమిషనర్, కోరుట్ల

భిక్షాటనతో నిరసనకు ప్రణాళిక..

వరద ముంపు ప్రాంతాలు బీజేపీకి చెందిన కౌన్సిలర్ దాసరి సునీత పరిధిలో ఉన్నాయి. దీంతో వరద ముంపు తప్పించడానికి చేపట్టే పనులకు నిధులు కేటాయింపు చేయలేదన్న కారణంతో ఆ వార్డు ప్రజలతో కలిసి భిక్షాటన చేసేందుకు కౌన్సిలర్ సిద్ధం కావడం చర్చనీయాంశంగా మారింది. ఈనెల 21వ తేదీన పది, పదకొండో వార్డుల్లోని ప్రకాశం రోడ్డు, అయిలాపూర్ రోడ్డు, కల్లూర్‌రోడ్డు ఏరియాల్లోని జనంతో కలిసి నిధుల కోసం భిక్షాటన చేస్తారు. అయితే, ప్రజా సమస్యలు రాజకీయ రంగు పులుముకోవడం చర్చనీయాంశంగా మారింది.

న్యూస్‌రీల్

సత్వర న్యాయం లక్ష్యం



మాట్లాడుతున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు పోలీసు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్పీ భాస్కర్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 26 మంది అర్జీదారులతో ఆయన నేరుగా మాట్లాడారు. వారిసమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఫిర్యాదుల్లో భూ సమస్యలు, భార్యాభర్తల మధ్య విభేదాలు, ఫైనాన్స్, గల్ఫ్‌కు పంపిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసినవి ఉన్నట్లు వివరించారు.

అవార్డు అందుకున్న శ్రీనివాస్

జగిత్యాల: మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ తోపాటు, కౌన్సిలర్ బొడ్ల జగదీశ్ హైదరాబాద్‌లో హరితపురస్కారం అందుకున్నారు. సోమవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన హరితోత్సవంలో భాగంగా దేవాదాయ, న్యాయ, అటవీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నుంచి హరిత పురస్కారం అందుకున్నారు.

'ఇథనాల్' సందర్శనకు నో



తీర్మానం కాపీ అందిస్తున్న గ్రామస్తులు

వెల్గటూర్(ధర్మపురి): గుజరాల్‌లోని ఇథనాల్ పరిశ్రమ సందర్శనకు రావాలనే అధికారుల ఆహ్వానానికి వ్యతిరేకంగా పాశిగామ, స్తంభంపల్లి గ్రామస్తులు తీర్మానం చేసి కాపీని తహసీల్దార్ రమేశ్‌కు సోమవారం అందజేశారు. స్తంభంపల్లిలో ఏర్పాటు చేయనున్న ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా స్తంభంపల్లి, పాశిగామ గ్రామస్తులు కొద్దిరోజులుగా ఉద్యమిస్తున్న సంగతి విదితమే. అయితే, పరిశ్రమ ఏర్పాటుతో సమీప గ్రామాలు కలుషిత మవుతాయని కరీంనగర్ జిల్లా పర్లపల్లిలోని ఇథనాల్ పరిశ్రమ సందర్శన సందర్భంగా తాము ఈ విషయాన్ని గుర్తించామని గ్రామస్తులు తెలిపారు.


బాధ్యతలు స్వీకరణ



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ

జగిత్యాలక్రైం: పట్టణ సీఐగా నటేశ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన రాంచందర్‌రావు.. కరీంనగర్‌కు బదిలీపై వెళ్లారు. కరీంనగర్‌లో పనిచేస్తున్న నటేశ్‌ను జగిత్యాల సీఐగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన నటేశ్.. ఎస్పీ భాస్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



మొక్క నాటుతున్న డీపీవో దేవరాజ్

మల్లాపూర్(కోరుట్ల): హరితహారం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమని జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ అన్నారు. సిరిపూర్‌లో సోమవారం నిర్వహించిన హరిత ఉత్సవంలో ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. ప్రజలు అందరూ మొక్కలు నాటాలని కోరారు. డీఎల్పీవో శ్రీనివాస్, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరో జన, వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంకు సుధాకర్‌కు అవార్డు



అవార్డు అందజేస్తున్న మధుసూదనాచారి

కోరుట్ల: పట్టణానికి చెందిన ముంబయి–ఆంధ్రా మహాసభ అధ్యక్షుడు సంకు సుధాకర్‌కు శ్రీ శాంతి కృష్ణ సేవా సమితి స్వర్ణ నంది అవార్డు అందజేసింది. హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ఎమ్మెల్సీ మధుసూదనాచారి ఈ అవార్డు అందజేశారు. ముంబయికి చెందిన అంతర్జాతీయ నృత్య కళాదర్శకులు రాధామోహన్ దంపతులను స్వర్ణ నంది అవార్డుతో సత్కరించారు.

నేడు విద్యా దినోత్సవం

జగిత్యాల: జిల్లాలో మంగళవారం విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి సోమవారం తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గ్రామస్థాయిలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించాలన్నారు. బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా చూడాలని ఆయన పేర్కొన్నారు.

ఉద్యమంలా హరితహారం



మొక్క నాటుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, పక్కన కలెక్టర్ యాస్మిన్ బాషా, జెడ్పీ చైర్‌పర్సన్ వసంత

- భావితరాలకు ఆక్సిజన్ అందించడం లక్ష్యం
- సాంఘిక సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్
- తొమ్మిదో విడత హరితహారం ప్రారంభం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి ఈశ్వర్ తదితరులు

సారంగాపూర్(జగిత్యాల): కాలుష్యరహిత తెలంగాణ, భావితరాలకు స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించడం లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా కొనసాగిస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో స్థానిక అటవీప్రాంతంలోని బతుకమ్మకుంట వద్ద సోమవారం హరితోత్సవం నిర్వహించారు. మంత్రి మొక్కలు నాటి మాట్లాడారు. వాతావరణ సమతుల్యం దెబ్బతినడంతో గతంలో చైనా ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలయ్యారని, దీంతో అక్కడ 250 కోట్ల మొక్కలు నాటి సమస్యను అధిగమించారని చెప్పారు. కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం గ్రామానికో నర్సరీ ఏర్పాటు చేసిందన్నారు. ఎస్సారెస్పీ ఆయకట్టు ఖాళీ భూముల్లోని ఎంపికచేసిన పది ప్రాంతాల్లో పండ్ల మొక్కలు పెంచుతామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, యాదాద్రి ప్లాంటేషన్ తరహాలో జగిత్యాల తారకరామానగర్‌లోనూ అటవీశాఖ మియావాకి ప్లాంటేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, పచ్చదనం అభివృద్ధికి సీఎం కేసీఆర్ తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయన్నారు. అంతకుముందు అటవీశాఖ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్, వివిధ కార్యక్రమాలను ఎల్‌ఈడీ స్క్రీన్‌లపై ప్రదర్శించారు. డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు, ఎంపీపీ కోల జమున, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గుర్రాల రాజేందర్‌రెడ్డి, ఎఫ్ఎస్‌వో మహేశ్, తహసీల్దార్ రవీందర్‌రావు, ఎంపీడీవో రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో హరిత తెలంగాణ

ధర్మపురి: సీఎం కేసీఆర్ పాలనలో హరిత తెలంగాణ సాధ్యమైందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. నేరెళ్లలో అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన హరితోత్సవంలో కలెక్టర్ యాస్మిన్‌బాషా, జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంతతో కలిసి మంత్రి మొక్కలు నాటి మాట్లాడారు. అనంతరం రెండో వైకుంఠ ధామం, మేదరి సంఘ భవనం ప్రారంభించారు. సీసీరోడ్డు పనులు, ఎస్సీ మాల కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ధర్మపురి వడ్డెర కాలనీ హరితవనం పరిశీలించారు. డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ, జెడ్పీటీసీలు చిట్టిబాబు, బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, సర్పంచ్ పలిగిరి వసుంధర, డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు, ఆర్డీవో మాధురి పాల్గొన్నారు.

నాటిన మొక్కలను పరిరక్షించాలి

- అదనపు కలెక్టర్ మకరంద్



బ్యాటింగ్ చేస్తున్న అదనపు కలెక్టర్ మకరంద్, పక్కన క్రీడాకారులు, అధికారులు, నాయకులు

కథలాపూర్(వేములవాడ): గ్రామాల్లో చేపట్టే హరితోత్సవంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలని అడిషనల్ కలెక్టర్ మకరంద్ కోరారు. మేడిపెల్లి మండలం కొండాపూర్‌లో చేపట్టిన హరితోత్సవంలో ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, సీఈవో రామానుజాచారి, డీఆర్డీవో లక్ష్మీనారాయణ, పంచాయతీరాజ్ ఈఈ రహమాన్, డీఈ గోపాల్, సర్పంచ్ అభిలాష్ పాల్గొన్నారు.

అన్నింటినీ కాపాడాలి

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): సంపద వనంలో నాటిన మొక్కలను కాపాడాలని అదనపు కలెక్టర్ మకరంద్ కోరారు. సంపద వనం, మినీస్టేడియంలో మొక్కలు నాటి మాట్లాడారు. డీఆర్డీవో లక్ష్మీనారాయణ, డీపీవో దేవరాజ్, డీఎల్‌పీవో శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి శివాజీ, ఎంపీపీ జాజాల భీమేశ్వరి, సర్పంచ్ లత, ఎంపీడీవో ప్రభ తదితరులు పాల్గొన్నారు. కాగా, హరితోత్సవంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ మకరంద్.. అక్కడ జరిగే క్రికెట్ టోర్నీ వద్దకు వెళ్లారు. క్రీడాకారులతో పరిచయం చేసుకున్నారు. వారితో కలిసి కాసేపు క్రికెట్ ఆడి ఉత్సాహ పరిచారు.

విజ్ఞానం.. పఠనాసక్తి

- ఏకాగ్రత పెంపొందించడం లక్ష్యం
- యువత, నిరుద్యోగుల కోసం పబ్లిక్ రీడింగ్ రూంలు
- జిల్లాలోని 30 పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు
- నేడు ఆరు గ్రామాల్లో ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి

కథలాపూర్(వేములవాడ): ప్రతీ వ్యక్తికి విజ్ఞానం అందించడం, పఠనాసక్తి, ఏకాగ్రతస్థాయి పెంచడంలో గ్రంథాలయాలు కీలకపాత్ర పోషిస్తాయి. వీటిలో అందుబాటులో ఉన్నపుస్తకాలు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు ఎంతో ఉపయోగపడుతాయి. అయితే, జిల్లాలో అన్నిచోట్ల గ్రంథాలయాలు లేకపోవడం, ఉన్నచోట పక్కాభవనాలు లేక పాఠకులు అసౌకర్యాలకు గురవుతున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం జిల్లాలోని 30 చోట్ల పబ్లిక్ రీడింగ్ రూంల పేరిట మినీ గ్రంథాలయాలు మంజూరు చేసింది. వాటిని గ్రామపంచాయతీ కార్యాలయాల్లోనే ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆరు గ్రామాల్లో వీటిని ప్రారంభించేందుకు అన్నీ సిద్ధం చేశారు.

పంచాయతీల్లో మినీ గ్రంథాలయాలు..

- జిల్లాలో 20 మండలాలు ఉండగా.. కొత్తగా 30 పబ్లిక్ రీడింగ్ రూంలను ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసింది.
- పబ్లిక్ రీడింగ్ రూంలను జిల్లా గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.
- కొత్తవాటిని ఏర్పాటు చేసే భవనాల్లో వసతుల కల్పన, ఫర్నీచర్ సమకూర్చడం కోసం పరిస్థితులను బట్టి రూ.2.50 లక్షల వరకు వెచ్చించాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పబ్లిక్ రీడింగ్ రూం

- ఒక్కో పబ్లిక్ రీడింగ్ రూం కోసం నెలకు రూ.2 వేల చొప్పున కేటాయిస్తారు.
- ఈ నిధుల్లోంచి రూ.1,000 వెచ్చించి పుస్తకాలు, దినపత్రికలు కొనుగోలు చేయాలి.

నేడు ప్రారంభించే పబ్లిక్ రీడింగ్ రూంలు

మండలం	గ్రామపంచాయతీ
మేడిపెల్లి	పోరుమల్ల
కొడిమ్యాల	నాచుపల్లి
మల్యాల	బల్వంతాపూర్
కోరుట్ల	అయిలాపూర్
జగిత్యాలరూరల్	చల్‌గల్
గొల్లపల్లి	రాఘవపట్నం

- మిగతా సొమ్ముతో నిర్వాహకులకు గౌరవ వేతనం చెల్లించాలని నిర్ణయించారు.
- ఇందుకోసం గ్రామపంచాయతీ కార్యాలయాల్లోనే ప్రత్యేకంగా గది కేటాయించాలి.

నేడు ఆరుచోట్ల ప్రారంభం

- జిల్లాలో ఆరుచోట్ల పబ్లిక్ రీడింగ్ రూంలను విద్యా దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు.

గ్రామీణ యువత కోసం..



గ్రామాల్లో చదువుకున్న యువత ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతోంది. వారు జిల్లా కేంద్రంలోని గ్రంథాలయానికి వచ్చిపోవడం కష్టం. సమయం వృథా అవుతుంది. అందుకోసమే 30 గ్రామాల్లో పబ్లిక్ రీడింగ్ రూంలు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఇప్పటికే ఆరు గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం వాటిని ప్రారంభిస్తాం. మిగతావి ఈనెలాఖరులోగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. నిరుద్యోగులు, యువత సద్వినియోగం చేసుకోవాలి. – చంద్రశేఖర్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

క్లుప్తంగా

21న జాబ్‌మేళా

జగిత్యాలటౌన్ : జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ నియామకాల కోసం ఈనెల 21న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి బింగి సత్యమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జోషితా ఇన్‌ఫ్రా డెవలపర్స్ కంపెనీలో డిజిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ విత్‌ఔట్ టార్గెట్ పోస్టుల భర్తీకి జిల్లా ఉపాధి కల్పనాధికారి ఆధ్వర్యంలో ఈనెల 21ఉదయం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం, జిల్లా కార్యాలయాల సముదాయం రూం నంబర్ 218లో జాబ్‌మేళా జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9666723356లో సంప్రదించాలని కోరారు.

అవార్డు అందుకున్న లావణ్య


అవార్డు స్వీకరిస్తున్న లావణ్య, ఆయాజ్

కోరుట్ల: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కోరుట్ల మున్సిపాలిటీకి ప్రకటించిన హరితహారం అవార్డును సోమవారం అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నుంచి మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, కమిషనర్ ఆయాజ్ అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి అవార్డు అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రం సీజ్


అంగన్‌వాడీ కేంద్రం ముందు చిన్నారులతో టీచర్

మెట్‌పల్లి: సెలవురోజున అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేయగా ఆ సమయంలో టీచర్ అందుబాటులో లేకపోవడంతో సీజ్ చేయడం చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కాలం చెల్లిన పాల ప్యాకెట్లను బాలింతలు, గర్భిణులకు పంపిణీ చేస్తున్నారని ఓ వ్యక్తి మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్ ద్వారా ఫిర్యాదు చేశాడు. దీంతో మంత్రి వెంటనే విచారణ జరపాలని ఆ శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. వారు జిల్లా అధికారులను ఆదేశించగా, ఈ మేరకు ఆదివారం సీడీపీఓ, సూపర్‌వైజర్‌లు పలు కేంద్రాలను తనిఖీ చేశారు. అదే సమయంలో 25వ వార్డులో ఉన్న కేంద్రం వద్దకు వెళ్లగా, సెలవురోజు కావడంతో సంబంధిత టీచర్ అందుబాటులో లేదు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాన్ని సీజ్ చేశారు. సోమవారం ఉదయం కేంద్రానికి వెళ్లిన టీచర్ సీజ్ చేసి ఉండడాన్ని గమనించి చిన్నారులతో అక్కడే బైఠాయించారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సిబ్బంది తాళం తీసి ఆ తర్వాత పాల ప్యాకెట్లను పరిశీలించారు. అవి కాలం చెల్లినవి కావని నిర్ధారణ కావడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

దొడ్డురకం సాగుకే మొగ్గు

- మద్దతు ధర, అధిక దిగుబడి వస్తుండటంతో రైతుల ఆసక్తి
- జిల్లాలో ప్రతి వానాకాలంలో రెండు లక్షల ఎకరాల్లో వరిసాగు


'జగిత్యాల రైస్-1' దొడ్డు రకం

జగిత్యాల అగ్రికల్చర్ : జిల్లాలో వానాకాలం సీజన్‌లో దాదాపు 3 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుంటారు. అందులో దొడ్డు రకాలను 2 లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేస్తుండగా, సన్న రకాలను లక్ష ఎకరాల్లో సాగు చేస్తుంటారు. దొడ్డు రకాలకు ఇటీవల ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ 2,203 వరకు ఉండడం, గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే వెసులుబాటు కల్పించడంతో రైతులు ఎక్కువశాతం దొడ్డు వరి రకాలనే సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. జిల్లాకు అనువైన దొడ్డు వరి రకాల గురించి పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు రైతులకు సూచిస్తున్నారు.

జగిత్యాల రైస్-1 (జేజీఎల్-24423)

ఈ రకం పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి 2019లో విడుదలైంది. 125 రోజుల్లో కోతకు రానుండగా ఎకరాకు 32-36 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఈదురుగాలులకు నేలపై పడిపోదు. ధాన్యం కూడా రాలదు. సుడిదోమ, అగ్గి తెగులు, చలిని కొంతవరకు తట్టుకుంటుంది. ఎంటీయూ-1010తో పోల్చితే 5-8 శాతం దిగుబడి ఎక్కువగా వస్తుంది. పురుగులు, తెగుళ్లను తట్టుకునే నిరోధక శక్తి ఎక్కువ.

బతుకమ్మ (జేజీఎల్-18047)

పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి విడుదలైన మొదటి దొడ్డు రకం. ఎకరాకు 30-35 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. 120 రోజుల్లో కోతకు వస్తుంది. ఉల్లికోడు, సుడిదోమ, అగ్గి తెగులు, చలిని తట్టుకుంటుంది. ఎంటీయూ-1010ని పోలిన దొడ్డు రకం. ఈ రకం సాగుచేసే ప్రాంతాల్లో బతుకమ్మను సాగు చేయవచ్చు. పంటపై గింజలు రాలవు.

కూనారం సన్నాలు (కెఎస్ఎం-118)

125 రోజుల్లో పంట కోతకు వస్తుంది. ఎకరాకు 28-32 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. గింజ రాలకపోవడంతో పాటు గింజ బరువు ఎక్కువగా ఉంటుంది. ఎంటీయూ-1010కి ప్రత్యామ్నాయంగా సాగు చేసుకోవచ్చు. పెద్దపల్లి జిల్లా కూనారం పరిశోధనా స్థానం నుంచి విడుదలైంది.

కాటన్ దొర సన్నాలు (ఎంటీయు-1010)

వానాకాలంలో 120 రోజుల్లో కోతకు వస్తుంది. ఎకరాకు 28-30 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. సుడిదోమ, అగ్గితెగులును, కొంతవరకు చలిని తట్టుకుంటుంది. ఈ రకానికి గింజ రాలే స్వభావం ఉన్నందున పంట కోత ఆలస్యం చేయొద్దు. వానాకాలం కంటే యాసంగిలో సాగు చేసేందుకు మిక్కిలి అనువైన రకం. జింక్ లోపాన్ని తట్టుకోదు.

తెలంగాణ వరి-3 (జేజీఎల్-21078)

వానాకాలంకు అనువైన రకం. పంటకాలం 130 రోజులు ఉంటుంది. ఎకరాకు 30-32 క్వింటాళ్ల వరకు దిగుబడి ఉటుంది. ఉల్లికోడు, అగ్గి తెగులును సమర్థవంతంగా తట్టుకుంటుంది.

కొన్ని దొడ్డు రకాలపై రైస్‌మిల్లర్ల పేచీ..

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రైతులు సాగుచేస్తున్న ఎంటీయూ-1001, ఎంటీయూ-1156, ఎంటీయూ-1153, ఎంటీయూ-1121, ఎంటీయూ-3291 రకాలను సాగు చేయొద్దని, ఈ రకాలు ఎఫ్‌సీఐ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేవని రైస్‌మిల్లర్లు పేచీ పెడుతున్నారు. ఈ రకాలను మరఆడించినప్పుడు అధిక నూక శాతం వస్తుండటంతో, ప్రస్తుత వానాకాలం సీజన్ నుంచి ఈ రకాలను తీసుకోబోమని చెబుతున్నారు. వీటికి బదులు ఎంటీయూ-1061, ఎంటీయూ-1064, ఎంటీయూ-1271, ఎంటీయూ-7029, బీపీటీ-5204, బీపీటీ-1224, ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ సోనా వంటి రకాలు సాగు చేయాలని రైస్‌మిల్లర్లు సూచిస్తున్నారు.

దొడ్డు రకమే సాగుచేస్తున్నా



దొడ్డు రకాలకు మద్దతు ధరతో పాటు గ్రామాల్లోనే కొనుగోలు చేసే వెసులుబాటు ఉండటంతో వానాకాలం, యాసంగి సీజన్లలో దొడ్డు రకాలు సాగు చేస్తాను. పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానానికి చెందిన దొడ్డు రకాలను సాగుచేసి, ఎకరాకు 30 క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుంది.

– తీపిరెడ్డి రత్నాకర్ రెడ్డి, వరి రైతు, జగిత్యాల

దొడ్డు రకాలపై ఆసక్తి



వానాకాలం సీజన్‌లో రైతులు దొడ్డు వరి రకాలు సాగు చేస్తుంటారు. వీటికి తెగుళ్లు, పురుగులు ఆశించకపోవడంతో ఎక్కువ మంది రైతులు సాగుకు మొగ్గు చూపుతున్నారు. సన్నపు రకాలతో పోల్చితే కొంతమేర దిగుబడి ఎక్కువగా ఉంటుంది.

– డాక్టర్ శ్రీనివాస్, వరి శాస్త్రవేత్త

ఇద్దరు ఎస్సైల బదిలీ

జగిత్యాలక్రైం: జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు ఎస్సైలను బదిలీచేస్తూ ఎస్పీ భాస్కర్ సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేశారు. వీఆర్‌లో పనిచేస్తున్న పి.కిరణ్‌కుమార్‌ను కథలాపూర్ ఎస్సైగా, డీసీఆర్బీ ఎస్సైగా పనిచేస్తున్న వి.పురుషోత్తంను జగిత్యాల టౌన్ ఎస్సైగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

విద్యుదాఘాతంతో వలసకూలీ మృతి

రాయికల్ : మండలంలోని ఉప్పుమడుగు గ్రామంలో సోమవారం రాత్రి విద్యుదాఘాతంతో వలస కూలీ మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా పెండిపల్లి మండలం లంకపెల్లి గ్రామానికి చెందిన తరగం సీతారాం (23) మండలంలోని ఓ కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడు. ఉప్పుమడుగు గ్రామంలో విద్యుత్ మరమ్మతుల కోసం లైన్‌మెన్ గంగారెడ్డికి ఎల్‌సీ తీసుకోమని సమాచారం ఇచ్చి స్తంభం ఎక్కగా ఎల్‌సీ ఇవ్వకపోవడంతో సీతారాం విద్యుదాఘాతానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం జగిత్యాలకు తరలిస్తుండగా మృతిచెందాడు.

మరో ఘటనలో వృద్ధురాలు..

కోరుట్ల: పట్టణంలోని కిన్నెర సినిమా థియేటర్ సమీపంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద నివసించే వృద్ధురాలు మృతిచెందింది. వివరాల్లోకి వెళితే.. చింతకింది భూమక్క అలియాస్ చక్కరికోట లక్ష్మీ (70) మృతిచెందింది. బార్ ముందు గల ఇంట్లో మొదటి అంతస్తులో లక్ష్మీ ఒక్కతే నివాసం ఉంటుంది. సోమవారం ఇంటి మొదటి అంతస్తు నుంచి దుర్వాసన రావటంతో స్థానికులు వెళ్లి చూడగా మృతిచెంది ఉంది. మూడు నాలుగు రోజుల క్రితం మృతిచెందినట్లు స్థానికులు భావిస్తున్నారు. మృతురాలి భర్త ఆగయ్య పదేళ్ల క్రితం మృతిచెందాడు. ఆహారం లేకనే మృతిచెందినట్లు తెలిసింది. హెడ్ కానిస్టేబుల్ రాజయ్య మృతదేహాన్ని పరిశీలించారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు మృతి

- ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న రఘుపతి కుటుంబ సభ్యులు, బంధువులు

వేములవాడఅర్బన్: వైద్యుల నిర్లక్ష్యంతోనే తన పాప చనిపోయిందని రఘుపతి డిమాండ్ చేశారు. వేములవాడ ఏరియా ఆస్పత్రి ముందు కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 8న ప్రసవం కోసం తన భార్యను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించామని, 9న ఆపరేషన్ తర్వాత పాప పుట్టడంతో వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని తెలిపారని, సుమారు రెండుగంటల తర్వాత పరిస్థితి బాగో లేకపోకపోవడంతో సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తరలించాలని సూచించారన్నారు. సిరిసిల్లలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే పాప మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే పాప చనిపోయిందని కలెక్టర్, జిల్లా వైద్యాధికారికి కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినా పట్టించుకోకపోవడం లేదని వైద్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహేశ్‌రావును వివరణ కోరగా వైద్యుల పర్యవేక్షణలోనే ఆపరేషన్ చేశామని, పిల్లల వైద్యుడు పరీక్షించి పాప పరిస్థితి బాగాలేదని, దాంతో సిరిసిల్ల ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించామన్నారు.

ఇసుక ట్రాక్టర్ అడ్డుకున్నందుకు దాడి

కోరుట్ల: పట్టణంలోని బతుకమ్మ వాగు సమీపం నుంచి ఇసుక తరలిస్తున్న వారిని అడ్డుకున్నందుకు ఓ ప్రజాప్రతినిధితో పాటు మరో వ్యక్తిపై దాడిచేసి గాయపరిచిన ఘటన సోమవారం రాత్రి 11.30 గంటలకు చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..కోరుట్ల బతుకమ్మ వాగునుంచి ఇసుకను ట్రాక్టర్లలో తరలిస్తుండగా జగ్జీవన్‌రామ్ విగ్రహం సమీపంలో తమ ఇంటి ముందు రోడ్డు దెబ్బతింటుందని మహ్మద్ పర్వేజ్ అనే వ్యక్తి ట్రాక్టర్‌ను అడ్డుకోగా అక్కడే ఉన్న ఓప్రజాప్రతినిధితో పాటు మరోవ్యక్తి పర్వేజ్‌పై రాయితో తలపై గాయపర్చినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదుచేశారు. విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

దొంగకు రెండేళ్ల జైలు

రాయికల్: మండలంలోని ఇటిక్యాల, మైతాపూర్ గ్రామాల్లో పలు దొంగతనాలకు పాల్పడిన పండరి బాలు పవర్‌కు రెండేళ్ల 7 రోజుల జైలుశిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ జగిత్యాల మొదటి శ్రేణి న్యాయమూర్తి జితేందర్ సోమవారం తీర్పునిచ్చారు. అప్పటి ఎస్సై ఆరోగ్యం, కానిస్టేబుల్ మహేందర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్ సాక్ష్యాలు కోర్టులో ప్రవేశపెట్టడంతో న్యాయమూర్తి శిక్ష విధించినట్లు తెలిపారు.

ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకుల ధర్నా

జగిత్యాల: ప్రైవేటు పాఠశాలల్లో అనుమతులు లేకుండా విద్యార్థులకు పుస్తకాలు విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ స్థానిక ఎమ్మార్వో ఎదుట ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ, కొన్ని పాఠశాలలు విద్యా వ్యాపారం చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. నాయకులు సంజయ్, సోహెల్, వినోద్, మనీష పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక ట్రాక్టర్లు

కోరుట్ల రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను సోమవారం పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించామని తహసీల్దార్ నీరటి రాజేశ్ తెలిపారు. మండలంలోని సంగెం, నాగులపేట, యెఖీన్‌పూర్, కోరుట్ల పరిసర ప్రాంతాల్లో వాగుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 15 ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు. ఇసుక తరలించేవారు తహసీల్దార్ కార్యాలయంలో అనుమతులు పొందాలన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెండు స్కూల్ బస్సులు సీజ్


తనిఖీ చేస్తున్న ఎంవీఐ

మెట్‌పల్లి: పట్టణంలో రవాణా శాఖ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. బస్ డిపో చౌరస్తాలో ప్రైవేట్ పాఠశాలలకు చెందిన తొమ్మిది బస్సులను తనిఖీ చేశారు. ఇందులో రెండు బస్సులకు సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు. ఆరు ఇతర వాహనాలను పరిశీలించి సరైన పత్రాలు లేకపోవడంతో జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎంవీఐ రంజిత్ మాట్లాడుతూ నిబంధనలు ప్రకారం అన్ని పత్రాలు పొందిన తర్వాతే బస్సులు నడపాలని, లేకపోతే చర్యలు తప్పవన్నారు. తనిఖీల్లో సుమారు రూ.3లక్షల వరకు జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య


జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అంగడి బజార్ ప్రాంతానికి చెందిన గంగిపెల్లి జమున (65) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. జమున కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు పలు ఆస్పత్రుల్లో చేర్పించినా ఆరోగ్యం నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై నజీమోద్దీన్ తెలిపారు.

డిస్కౌంట్ పేరుతో మోసం

- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హనుమాన్‌వాడకు చెందిన ఓ మహిళ స్థానికులకు రూ.20వేల సామగ్రి రూ.10 వేలకే ఇస్తానని పలువురి నుంచి డబ్బులు వసూళ్లు చేసి ఘరానా మోసానికి పాల్పడినట్లు సమాచారం. కొన్నిరోజులుగా స్థానికంగా కిరాణ షాపు నిర్వహిస్తూ సామగ్రిని తక్కువ ధరకే ఇస్తానంటూ నమ్మబలికి పలువురికి సామగ్రి అప్పగించింది. దీంతో సుమారు 30-50 మంది బాధితులు డబ్బులు చెల్లించగా సామగ్రి అప్పగించకపోవడంతో మోసపోయినట్లు తెలుసుకున్న బాధితులు సోమవారం రాత్రి పోలీసులను ఆశ్రయించారు.

క్షుద్రపూజలు కలకలం


బీమారంలో క్షుద్రపూజలు

కథలాపూర్(వేములవాడ): బీమారం మండలకేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి క్షుద్రపూజలు కలంకలం రేపాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బీమారం గ్రామంలోని ఓ వ్యక్తి ఇంటి ఎదుట పసుపు, కుంకుమ, నిమ్మకాయలు ఉండటంతో క్షుద్రపూజలు చేసినట్లు తెలిపారు. ఘటనపై పోలీసులు ఆరా తీసినట్లు తెలిసింది.

ఇద్దరిపై కేసు నమోదు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన ఇల్లెందుల శివకుమార్, బత్తిని సంతోష్‌లు ఈతచెట్లు గీసే ఉలితో దాడి చేసుకోగా ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సుధాకర్ తెలిపారు. గ్రామనికి చెందిన ఇల్లెందుల శివకుమార్, బత్తిని సంతోష్ మధ్య కొద్దిరోజుల క్రితం ఓ వివాహంలో డీజే విషయంలో గొడవ జరిగింది. దీంతో సోమవారం సాయంత్రం గ్రామ శివారులోని ఈతవనంలో ఈతచెట్లు గీసే ఉలితో ఒకరికొకరు దాడి చేసుకోగా ఇద్దరికి గాయాలయ్యాయి. దీంతో స్థానికులు చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కాపర్ వైర్లు చోరీ

వెల్గటూర్: మండలంలోని పాశిగామ, కోటిలింగాల గ్రామాల్లోని రైతుల పొలాల్లో కాపర్ వైర్లను దొంగలు ఎత్తుకెళ్లారు. గోదావరి నది తీరం వెంబడి పాశిగామ నుంచి కోటిలింగాల వరకు ఉన్న నదీ తీరం వెంబడి పొలాలకు గోదావరి నది నుంచి సాగునీరందించే మోటార్ల నుంచి కాపర్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. నాలుగు రోజులకింద పాశిగామ శివారులోని వైర్లు దొంగిలించగా, ఆదివారం కోటిలింగాల శివారులోని వైర్లను ఎత్తుకెళ్లారు. ఇప్పటి వరకు సుమారు 30 మంది పొలాల వద్ద సుమారు రూ.2 లక్షల విలువ చేసే కాపర్ వైర్లను ఎత్తుకెళ్లినట్లు రైతులు తెలుపుతున్నారు. వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వారిని వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

- పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలి
- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: మొక్కలు నాటడం ప్రతిఒక్కరి సామాజిక బాధ్యతని, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం తెలంగాణ హరితోత్సవంలో భాగంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ భాస్కర్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించినప్పుడే భావితరాలకు కాలుష్య రహిత సమాజాన్ని అందించవచ్చన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో హరితహారం కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించి కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో 10 శాతం నిధులు పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కేటాయిస్తోందన్నారు. ఎస్పీ ఎగ్గడి భాస్కర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం హరితోత్సవ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందన్నారు. చెట్లు మానవాళికి ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు ప్రకాశ్, రవీంద్రకుమార్, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ నరేశ్, ఎస్బీ సీఐ రాజశేఖర్ రాజు, ఆర్ఐలు వామనమూర్తి, నవీన్ పాల్గొన్నారు.

వరద కాల్వలో ఇసుక తవ్వకాలను అరికట్టాలి

- జాతీయ రహదారిపై జగ్గాసాగర్ గ్రామస్తుల ఆందోళన


ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

మెట్‌పల్లి: వరద కాల్వలో ఇసుక తవ్వకాలను ఇసుక తవ్వకాలను అరికట్టాలంటూ పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం జగ్గాసాగర్ గ్రామస్తులు ఆందోళనకు దిగారు. గ్రామం నుంచి వందలాది మంది పట్టణానికి తరలివచ్చి పాత బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కొంతకాలంగా వరద కాల్వ నుంచి అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని, దీనిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాంలచ్చక్కపేట గ్రామస్తులు కాల్వపై నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించాలని, భారీ వర్షాలకు కొట్టుకుపోయిన వరద కాల్వ కట్టకు మరమ్మతులు చేపట్టాలన్నారు. సుమారు గంటపాటు రాస్తారోకో చేయడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. చివరకు పోలీసులు వచ్చి రాస్తారోకో విరమింపజేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఆర్డీవో కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ధర్మపురికి ప్రకటించిన రూ.500కోట్లు ఎక్కడ?

- మాజీ ఎంపీ వివేక్


మాట్లాడుతున్న వివేక్

ధర్మపురి: ధర్మపురి అభివృద్ధి కోసం ప్రకటించిన రూ.500 కోట్ల ఎక్కడ అని మాజీ ఎంపీ వివేక్ ప్రశ్నించారు. పట్టణంలో సోమవారం రాత్రి మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వివేక్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎంతమందికి డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చారని ప్రశ్నించారు. తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మిషన్ భగీరథ పథకం వృథా కావడంతో ఈ పరిస్థితి తలెత్తిందని విమర్శించారు. రాత్రి కళాశాల మూసివేసే దశకు చేరుకుందని అన్నారు. కనీసం డిగ్రీ కళాశాల లేదన్నారు. రాష్ట్రంలో చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కేంద్రప్రభుత్వమే నిధులు విడుదల చేస్తోందని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ, నాయకులు కస్తూరి సత్యం, మర్రిపెల్లి సత్యం, పిల్లి శ్రీనివాస్, బండారి లక్ష్మణ్, గాజుల మల్లేశం, ఓరగంటి చంద్రశేఖర్, కాడే సూర్యనారాయణ, బెజ్జారపు లవన్, గాజు భాస్కర్, కొమ్ము రాంబాబు, ఎన్.చంద్రశేఖర్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

చౌకగా ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు


సిబ్బందితో కలిసి కేక్ కట్‌చేస్తున్న డీఎం

జగిత్యాలటౌన్ : ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు చౌకగా లభించడంతో సామాన్య మధ్య తరగతి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందని జగిత్యాల డిపో మేనేజర్ వెంకటనర్సప్ప అన్నారు. టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు ప్రారంభించి నేటికీ మూడు సంవత్సరాలు పూర్తయిన చేసుకున్న సందర్భంగా సోమవారం కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో డిపో కార్గో సిబ్బంది, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, బుకింగ్ స్టాఫ్ వాసు, ట్రాఫిక్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఎంఎఫ్ కవిత పాల్గొన్నారు.